క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో



మాక్లూర్: మాక్లూర్ నూతన ఎంపీడీవోగా ఎం. బ్రహ్మానందం శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీవోగా పని చేసిన లక్ష్మారెడ్డి బదిలీపై ధర్పల్లికి వెళ్లారు. ఆర్మూర్ నుంచి బ్రహ్మానందం బదిలీపై మాక్లూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయా జీపీల కార్యదర్శులు, కారోబార్లు ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



కమ్మర్‌పల్లి: రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిదని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు అన్నారు. శనివారం కమ్మర్‌పల్లి కేజీబీవీలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ గంగామణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోధన్: మండలంలోని అమ్దాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ విద్యాలయం ప్రత్యేక అధికారిణి హిమబిందు శనివారం ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ గ్రూప్‌లో 28 సీట్లు, బైపీసీ గ్రూప్‌లో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.ఈ నెల 26 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. డే మహిళ వాచ్‌మెన్, వంట మనిషి పోస్టులు ఖాళీగా ఉన్నాయని. అర్హులైన అనుభవం కలిగిన మహిళలు ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ 8501077646 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలి



బోధన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సాలూర ఎంఈవో రాజీ మంజూష సూచించారు. ఎన్ఎస్‌పీసీ(నేషనల్ స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటీషన్) కార్యక్రమంలో భాగంగా శనివారం పీఎం శ్రీ సాలూర జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినులకు మోతుకాకులతో విస్తారాకుల తయారీ పోటీలను నిర్వహించారు. ఈపోటీలను ఎంఈవో పరిశీలించారు. ప్రతిభ చాటిన విద్యార్థినులను అభినందించారు. ఉపాధ్యాయులు రుద్ర సంతోష్ కుమార్ యాదవ్, కాంబ్లే విఠల్, గంధపు సాయిలు,అరుణ్‌కుమార్, సంగీత్‌రావు, రాజ్ కుమార్ ,అబ్బయ్య, సుధారాణి, మహేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



బోధన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బోధన్ తహసీల్దార్ విఠల్ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆచన్‌పల్లి శాఖ అధ్వర్యంలో శనివారం పట్టణ కేంద్రంలోని గంజ్ ప్రాంతంలో గల విజయ సాయి హైస్కూల్‌లో మొక్కలు నాటారు. పాఠశాల ప్రిన్సిపల్ ,క్లబ్ అధ్యక్షుడు కృష్ణ మోహన్, ప్రతినిధులు మున్సిపల్ వార్డు మానిటరింగ్ ఆఫీసర్ షఫీ,సభ్యులు ఉన్నారు.

మృతదేహం తరలింపునకు ఈఆర్ ఫౌండేషన్ సాయం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ గురుకుల కళాశాలలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థి గడ్డం సంతోష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడానికి ఈఆర్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. మృతదేహం తరలింపునకు కుటుంబసభ్యుల వద్ద డబ్బులు లేవన్న విషయం తెలుసుకున్న ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ ప్రత్యేక అంబులెన్సును ఏర్పాటు చేశారు.

గదులు రెండు.. తరగతులు ఐదు

- వరండాలోనే విద్యా బోధన
- ఆర్మూర్‌లోని వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



వడ్డెర కాలనీలోని ప్రాథమిక పాఠశాల



వడ్డెర కాలనీలోని పాఠశాలలో వరండాలోనే పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని వడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలలో 131 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదు వరకు తరగతులు ఉండగా, కేవలం రెండు గదులే అందుబాటులో ఉన్నాయి. మిగితా మూడు తరగతులకు విద్యాను పాఠశాల వరండాలోనే విద్యార్థులకు బోధిస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోంది. తడవకుండా ఉండేందుకు అన్ని తరగతుల విద్యార్థులకు రెండు గదుల్లోనే బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాల ప్రాంగణంలో ఆటలకు కావలసిన మైదానం లేదు. దీంతో విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి తగ్గుతోంది. గదుల కొరతతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించడానికి ముందుకు రావడం లేదు. దీంతో పాఠశాల హెచ్‌ఎం టి.లక్ష్మణ్ సొంతంగా రూ. లక్ష ఖర్చు చేసి పాఠశాలకి పెయింటింగ్ వేయించారు. పాఠశాల ముందు భాగంలోని డ్రెయినేజీకి మరమ్మతులు కూడా చేయించారు. ప్రభుత్వం మరో మూడు అదనపు గదులు నిర్మిస్తే పాఠశాలలో విద్యార్థులసంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈవిషయమై ఉన్నతాధికారులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అదనపు గదులు నిర్మించాలి

పాఠశాలలో మరో మూడు అదనపు గదులు నిర్మించాలి. దీంతో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు పంపించడానికి నిరాకరిస్తున్నారు.

– టి.లక్ష్మణ్, పాఠశాల హెచ్‌ఎం, వడ్డెర కాలనీ,ఆర్మూర్

సృజనాత్మకతను వెలికితీసే బాధ్యత టీచర్లదే



భోజనం చేస్తున్న డీఈవో అశోక్

బోధన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈవో అశోక్ అన్నారు. శనివారం ఎడపల్లి మండలంలోని జానకంపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఏటీఎల్ (అటల్‌టింకరింగ్‌ల్యాబ్) ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఏటీఎల్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల హెచ్‌ఎం జోన్స్, ఏఎంవో బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీరందించాలని వినతి



నవీపేట : వర్షాభావ పరిస్థితులలో రైతులకు సాగునీరందించి ఆదుకోవాలని బీజేపీ నాయకులు శనివారం తహసీల్దార్ వెంకట రమణకు వినతి పత్రం అందజేశారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు రైతులు డీ–50 కాలువపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, వెంటనే కాలువ ద్వారా నీటిని వదలాలని కోరారు. మండలంలోని నిజాంపూర్ లిఫ్ట్ కింద 1600 ఎకరాల ఆయకట్టు ఉందని, ఇటీవల లిఫ్ట్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటిని విడుదల చేసేందుకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ద్యాగసరిన్, నాయకులు భోజన్న, రాజేంధర్‌గౌడ్, పిల్లి శ్రీకాంత్, భూషన్, కోరె గంగాధర్, ఆనంద్, గణేష్, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్, బూనాది ప్రవీన్ తదితరులున్నారు.

స్థల పరిశీలనకే పరిమితమా..

- ముప్కాల్‌లో పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం రూ.1.43 కోట్లు మంజూరు
- రెండేళ్లుగా మూలుగుతున్న నిధులు
- పనులు ప్రారంభించాలని వినతి



ముప్కాల్ పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ (ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పనులు స్థల పరిశీలనలో నిలిచిపోయాయి. గత రెండేళ్ల క్రితం పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం రూ.1.43 కోట్లు మంజూరు చేసింది. అప్పటి నుంచి మండల కేంద్రంలో స్థలం కోసం వెతుకుతూనే ఉన్నారు. ముందుగా నిజాంసాగర్ కాలువ పక్కన ఇరిగేషన్ స్థలాన్ని పరిశీలించారు. తరువాత ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్ వెనుక భాగాన గల స్థలాన్ని ఇటీవల డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ , వైద్య బృందంతో కలిసి పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఆసుపత్రి భవన నిర్మాణం కోసం రెండు ఎకరాల స్థలం ఉండాలి. డీఎంహెచ్‌వో పరిశీలించిన స్థలం అంతా లేదని తెలుస్తోంది. ఈవిషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాగా నిర్మాణ పనులు ప్రారంభించాలని మౌఖికంగా సూచించినట్లు వైద్యాధికారులు తెలుపుతున్నారు. స్థలం కేటాయింపు జరిగినట్లు జీవో ఏమీ లేదని తెలుస్తోంది. మండల కేంద్రం ఏర్పడి 8 ఏళ్లు కావస్తున్న ఇప్పటికి కార్యాలయాలకు సొంత భవనాలు లేవు.ఆసుపత్రి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తారు

గత పదిరోజుల క్రితం డీఎంహెచ్‌వో పరిశీలించిన స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సంబంధిత అధికారులకు కూడా పనులు ప్రారంభించాలని సూచించాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తారు.

– డాక్టర్ రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్

ఆరోగ్య ఉపకేంద్రం కోసం స్థల పరిశీలన



పాతంగల్‌లో స్థల పరిశీలన చేస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

రుద్రూర్: ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణం కోసం శనివారం పాత పోతంగల్‌తో పాటు మండల కేంద్రంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో స్థల పరిశీలన చేశారు. గతంలో ఆరోగ్య ఉప కేంద్రం కోసం పాత పాతంగల్ లోని డబుల్ బెడ్ రూం సమీపంలోని స్థలాన్ని గుర్తించారు. ఈస్థలం వివాదంలో ఉండడంతో మరో స్థలాన్ని స్థానిక నాయకులు చూపించారు. స్థానికులతో చర్చించి ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి అనువైన స్థలాన్ని త్వరగా ఫైనల్ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో చందర్, హెల్త్ సూపర్ వైజర్లు సుజాత, సావిత్రి, స్థానిక నాయకులు ఉన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమాలకైనా వెనుకాడం



ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేయడానికైనా వెనుకాడబోమని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు వంగ మహేందర్ రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని కోనసముందర్‌తో పాటు పలు గ్రామాలలో నిర్వహించిన పీఆర్‌టీయూ సభ్యత నమోదు కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ రెడ్డి కిషన్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ సమస్యల పరిష్కార విషయంలో పీఆర్‌టీయూ ఎల్లవేళలా ముందు వరుసలో ఉంటుందన్నారు. పెండింగ్ బిల్లుల విషయంలో సంఘం స్పష్టమైన వైఖరితో ఉందని త్వరలోనే అన్ని రకాల పెండింగ్ బిల్లులు మంజూరవుతాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార విషయంలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి కృషి చేసున్నారన్నారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేయకపోతే అన్ని సంఘాల సమన్వయంతో ఉద్యమ బాట చేపడతామని పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అంజాద్ సుల్తాన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాజేశ్వర్‌గా డ్, శ్రీనివాసమూర్తి తదితరులున్నారు.

గోనుగొప్పులలో నీటి సమస్యను పరిష్కరించండి

- ఎస్ఈతో మాట్లాడిన ఎమ్మెల్యే వేముల



మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని గోనుగొప్పులలో నీటి సమస్యను పరిష్కరించాలని బాల్కొండ ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈతో విన్నవించారు. శనివారం ఆయన ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. గోనుగొప్పుల మహిళలు నీటి సమస్యను పరిష్కరించాలని రోడ్డెక్కడం తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే ఎస్ఈకి వివరించారు. గ్రామంలో 200 ఇళ్లకు పైగా ఉన్నాయని ఇక్కడ ఉన్న నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని అందుకే నీటి సమస్య ఉత్పన్నమైందని ఎమ్మెల్యే తెలిపారు. కొత్త ట్యాంకు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించడానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని అందులో భాగంగా కింది స్థాయి సిబ్బందిని తక్షణమే గోనుగొప్పులకు పంపించాలని ఎమ్మెల్యే వివరించారు.

పాఠశాలల్లో బోనాల పండుగ



రెంజర్లలో బోనాలతో విద్యార్థులు



దొంకేశ్వర్ పీఎంశ్రీ జెడ్పీ స్కూల్‌లో..



పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ..



ఆర్మూర్‌లోని లోటస్ పాఠశాలలో..



శివతండా పాఠశాలలో..

బాల్కొండ/మోర్తాడ్/కమ్మర్‌పల్లి/దొంకేశ్వర్/పెర్కిట్ : పలు పాఠశాలల్లో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ముప్కాల్ మండలం రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోర్తాడ్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, కమ్మర్‌పల్లి స్థానిక శ్రీ విద్యా సాయి హైస్కూల్, డొంకేశ్వర్ పీఎంశ్రీ జెడ్పీ పాఠశాల, తొండాకూర్ ఎస్ఎస్‌వీ, పాలెం ప్రాథమికోన్నత పాఠశాల, శివతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఆర్మూర్‌లోని లోటస్, ప్రజ్ఞ, నలంద పాఠశాలల్లో విద్యార్థులు బోనమెత్తుకున్నారు. విద్యార్థులు పోతరాజుల వేషధారణ వేయగా, విద్యార్థినులు బోనాలు ఎత్తుకుని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జక్కుల రవి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ మోసిస్ జాబ్రి, కరస్పాండెంట్ ప్రదీప్, టీచర్లు, విద్యా సాయి హైస్కూల్ కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, డైరెక్టర్ ఏనుగు ప్రమీల, హెచ్‌ఎం శ్రీనివాస్, జాన్, దొంకేశ్వర్ పీఎంశ్రీ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సురేశ్ కుమార్, వీడీసీ ప్రతినిధులు మహిపాల్ రెడ్డి, సుమన్, ఉపాధ్యాయులు, ఎస్ఎస్‌వీ కరస్పాంటెండ్ చిరంజీవి, ఉపాధ్యాయులు స్వామి, నరేశ్, పాలెం పాఠశాల హెచ్‌ఎం ప్రమీలారాణి, శివతండా పాఠశాల హెచ్‌ఎం శివకుమార్, లోటస్, ప్రజ్ఞ, నలంద పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మోర్తాడ్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో...



కమ్మర్‌పల్లిలో పోతరాజుల వేషధారణలో విద్యార్థులు



తొండాకూర్‌లో.. ఎస్ఎస్‌వీ విద్యార్థులు

నిధులు మంజూరు చేయాలి

నందిపేట్(ఆర్మూర్): నందిపేటలో గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డికి నందిపేట నాయకులు వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నందిపేటలోని గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను వివరించారు. నాయకులు కిష్టగౌడ్, సిలిండర్ లింగం, తమ్మల దేవేందర్‌లు ఉన్నారు.

వ్యర్థాలతో కళాకృతులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మోడల్ స్కూల్ విద్యార్థులు శనివారం వ్యర్థాలతో కళాకృతులను తయారు చేసి ప్రదర్శించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా విద్యార్థులు వ్యర్థాలతో కళాకృతులను రూపొందించారు. విద్యార్థులను మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ పూర్ణ మౌళి , శానిటరి ఇన్‌స్పెక్టర్ సురేష్ అభినందించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

రుద్రూర్: పార్టీ బలోపేతానికి ప్రతికార్యకర్త పనిచేయాలని మండల బీఆర్ఎస్ ఇన్‌చార్జి గాండ్ల మధు పిలుపునిచ్చారు. రుద్రూర్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సాయి కుమార్, సాయిలు, నరేందర్, తదితరులున్నారు.

డిజిటల్ బోధనకు కోనాపూర్ పాఠశాల ఎంపిక

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జెడ్పీహెచ్ఎస్ ఖాన్ అకాడమీ డిజిటల్ బోధనకు ఎంపికైనట్లు హెచ్‌ఎం చౌడారపు రామ్‌ప్రసాద్ తెలిపారు. 6,7 తరగతులకు మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్, 8,9,10 తరగతులకు మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, ఇంగ్లిష్, గ్రామర్, బ్రిడ్జీ కోర్సులు ఇంటరాక్టివ్ తరగతుల ద్వారా విద్యార్థులు నేర్చుకుంటారన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



రాయకూర్‌లో రైతు పొలం బాటలో పాల్గొన్న అధికారులు

రుద్రూర్: రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో ఏడీఈ కె. నగేష్ కుమార్ సూచించారు. మండలంలోని రాయకూర్‌లో శనివారం పొలం బాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు విద్యుత్ పొదుపు కోసం కెపాసిటర్లు అమర్చడంతో కలిగే లాభాలు వివరించారు, సమస్యలను విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. టోల్ ఫ్రీ నెంబర్ 1912 కాల్ చేసి తెలియజేయాలని సూచించారు. ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్ సాబిల్ , నాయకులు, రైతులు, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

పోతంగల్ మండలం కల్లూర్ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రుద్రూర్ ఏడీఈ నగేష్ కుమార్ మాట్లాడుతూ..వదులుగా ఉన్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్ ఫార్మర్ల గద్దెలు , వంగిన స్తంభాలు, లైన్ క్రాసింగ్ తదితర ప్రమాదాకరంగా ఉన్నట్టు గమనిస్తే స్థానిక లైన్‌మన్‌కు తెలియజేయాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈ ఫకృద్దీన్ ఖాద్రి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాలమహానాడు నాయకులు



మంత్రి వివేక్‌తో మాల మహానాడు నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ డివిజన్ మాల మహానాడు నాయకులు శనివారం హైదరాబాద్‌లో కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి యోగేశ్వర కాలనీలో నిర్మిస్తున్న అంబేడ్కర్ అభ్యుదయ మాల సంఘాన్ని మున్సిపల్ శాఖ సిబ్బంది కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. అలాగే త్వరలో ఆర్మూర్‌లో నిర్వహించనున్న మాలల ఆత్మీయ సమ్మేళనానికి నాయకులు మంత్రిని ఆహ్వానించారు. అంగరి ప్రదీప్, శెట్‌పల్లి నారాయణ, మూగ ప్రభాకర్, పులి గంగాధర్, చిటుమల నాగేష్ తదితరులున్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మాక్లూర్: అడవి మామిడిపల్లి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అడవి మామిడిపల్లి వద్ద కాపు కాచి ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వైపు ఇసుకతో వెళ్తున్న టిప్పర్‌ను పట్టుకొని బాధ్యుడిపై కేసు నమోదు చేశారు.

మాజీ మంత్రి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలి

మోర్తాడ్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఏర్గట్ల పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. కేటీఆర్ ఖమ్మంలో ఈనెల 18న సీఎం రేవంత్‌రెడ్డిపై పరుషపదజాలంతో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని వెల్లడించారు. నాయకులు వేణుగోపాల్ యాదవ్, శివన్నోళ్ల శివకుమార్, సోమ దేవారెడ్డి, గడ్డం జీవన్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

మోర్తాడ్: మండలంలోని పాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఇదే గ్రామానికి చెందిన అమెరికాలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎనుగందుల సాయినాథ్ రూ.30వేల విలువ చేసే క్రీడా దుస్తులను పంపిణీ చేశారు.పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయినాథ్ క్రీడా దుస్తులను అందించారు. హెచ్‌ఎం వేణుగోపాల్‌రావు, టీచర్లు మహేష్‌కుమార్, నర్సింహాస్వామి, రాజేందర్, త్రివేణి, మమత, రాజేశ్వరి, సైఫ్‌అలీ, నచ్చయ్య తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



రెంజల్/పెర్కిట్ : మండలంలోని బోర్గాం గ్రామంలో ముగ్గురు బాధితులకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బోధన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కార్తిక్‌యాదవ్ శనివారం పంపిణీ చేశారు.గ్రామ అధ్యక్షుడు చిరడి రవి, యూత్ కాంగ్రెస్ నాయకుడు అబ్బోల్ల శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు సిద్ద సాయిలు, నీరడి గంగాధర్, సంజీవ్, దూపల్లి హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో నలుగురు బాధితులకు మంజూరైన 1.01 లక్షల చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, మాజీ సర్పంచ్ సుర్బిర్యాల జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి చిన్నా రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ విట్టం జీవన్, నాయకులు పాల్గొన్నారు.

రూ.4 లక్షల ఎల్‌వోసీ అందజేత..

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామానికి చెందిన జక్కుల పరస్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరగా వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలని సూచించారు. దీంతో పరస్ తల్లి భూదేవి కుమారుడికి కిడ్నీ ఇవ్వడానికి ముందుకు రావడంతో త్వరలోనే మార్పిడి చేయనున్నారు. ఇందుకు కావాల్సిన వైద్య ఖర్చుల విషయాన్ని స్థానిక నాయకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సునీల్ రెడ్డి పరస్ వైద్యానికి రూ.2.5 లక్షలు, భూ దేవి వైద్యానికి రూ. 1.5 లక్షలను మంజూరు చేయిస్తూ ఎల్‌వోసీను అందజేశారు. ఈసందర్భంగా బాధితులు సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.